ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
విజయనగరం

రహదారి భద్రతకు ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరంలో శనివారం 150 ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుండి 8గంటల వరకు పోలీసులు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. డిఎస్‌పిల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చేపట్టిన ఈ తనిఖీలను ఎస్‌పి ఎఆర్ దామోదర్ స్వయంగా పర్యవేక్షించారు. రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, నిబంధనలకు విరుద్ధంగా వాహన పత్రాలు సక్రంగా లేని వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ తనిఖీల్లో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 5గురు డిఎస్పీలు, 30మంది సిఐలు, 100 మంది ఎస్‌ఐలతో సహా సుమారు 1000 మంది సిబ్బందిని వినియోగించినట్లు తెలిపారు. వాహన పత్రాలు సక్రమంగా ఉన్నవి, లేనిది గుర్తించి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపైన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తనిఖీల్లో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్య రెడ్డి, ఎస్.రాఘవులు, డిపిడిసి డిఎస్పీ వీరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గురజాడపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- మాటలకే పరిమితమైన స్వగృహ అభివృద్ధి, పరిరక్షణ
- ఆధ్యాత్మికతపై ఉన్న శ్రద్ధ దార్శినికునిపై ఏదీ?
- ప్రభుత్వ వింతపోకడలపై కవులు, రచయితలు, సాహితీవేత్తల్లో ఆందోళన
- నేడు సాహితీ స్రవంతి, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన అప్పారావు వర్ధంతి
- హాజరు కానున్న పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు

గురజాడ... ఈ పేరు వినగానే సాహిత్యం, దేశభక్తి, సామాజిక అంశాలు. గుర్తుకువస్తాయి. అందులోనూ విజయనగరం అనగానే టక్కున గుర్తుకు వచ్చేది గురజాడే. ఆయన పూర్తి పేరు గురజాడ వెంకట అప్పారావు. నూటా పదేళ్ల క్రితం జీవించిన మహాకవి గురజాడ అప్పారావు తెలుగు సాహిత్య సాంస్కృతిక సామాజిక వికాసానికి అడుగుజాడ. ఇక్కడి నుంచి ఆయన రాసిన రచనలు, నాటకాలు, కవితలు, దేశభక్తి గేయాలు ఎల్లలు దాటాయి. ఆయన ఆలోచనలు, రచనలూ ఇప్పటికీ గొప్ప స్ఫూర్తిని కలిగిస్తాయి. మార్గదర్శనం చేస్తాయి. "దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నది మహాకవి గురజాడ 'దేశభక్తి' గేయంలో మకుటాయమానమైన వాక్యం. అప్పటికి దేశమంటే రాజులూ, నదులూ, పర్వతాల గురించే ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ, అందుకు భిన్నంగా మనుషుల గురించి ఆలోచించాలని గురజాడ వందళ్ల క్రితమే పిలుపునిచ్చాడు. తిండి కలిగితే కండకలదోయ్.. కండ కలవాడేను మనిషోయ్.. అని మనిషికి నిర్వచనమిచ్చాడు. ఇటువంటి దార్శినికుని వర్ధంతిని నేడు (ఆదివారం) సాహితీ స్రవంతి, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నగరంలో నిర్వహించనున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమాజంలో ఎంతో మంది అభ్యుదయ కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఉన్నప్పటికీ గురజాడ ప్రత్యేకమైనవారు. సామాజిక దురాచారాలను తన కలంతో చెండాడిన మహనీయుడు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న వరకట్నం, బాల్యవివాహాలను వ్యతిరేకించడం మొదలుకుని, కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన ఈ దేశంలో మనుషులు తమ చేతుల్లో ఏమీ లేదని స్తబ్ధంగా బతికేస్తున్న వెనుకబాటును ఆనాడే గుర్తించిన మహనీయుడు. వీటితోపాటు ధనం మూలం మిదం జగత్ అన్న దాన్ని మరింత సూటిగా చెప్పాడు గురజాడ. కన్యాశుల్కంలో హాస్యం, వ్యంగ్యం ప్రధానమైతే- పుత్తడి బొమ్మ పూర్ణమ్మలో మానవీయత, ఆర్ద్రతతకు పెద్దపీట వేశాడు. పూజారింటను పుట్టిన చిన్నది పుత్తడిబొమ్మ పూర్ణమ్మ.. అన్న చరణంతో మొదలై దుర్గను చేరెను పూర్ణమ్మ వరకూ నడిచే ఖండికలో ఒక వ్యర్థమైన అక్షరం లేకుండా గుండెలను పిండే భావం పొదిగాడు. ఇలా అనేక అంశాలపై లెక్కకు మించిన రచనలు చేసి, యావత్తు జాతిని మేల్కొపుతున్న గురజాడ రచనలు, సాహిత్యం నేటికీ, నాటికీ ఎంతో ఆదర్శనీయం. ఈనేపథ్యంలో ఆయన ముందు చూపు, సమాజానికి ఆయన చూపిన దారి ముందుకు తీసుకెళ్లాలని భావించిన నగరంలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ సాహితీవేత్తలు ఆయన జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు. గురజాడ సాహిత్యం మరింత పదిలం కావాలనే సంకల్పంతో గురజాడ కుటుంబీకులు 1980లోనే ఆయన స్వగృహాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. 2015లో దీన్ని ప్రభుత్వం పురావస్తు శాఖకు అప్పగించింది. నాటి నుంచి గురజాడజాడ స్వగృహాన్ని సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉంది. అయితే ప్రభుత్వాలెన్ని మారినా దీనిపై హామీలు తప్ప, అమలుకు పూనుకోలేదు. చివరకు ఇటీవల ఆధ్యాత్మిక గురువు సత్యసాయిబాబా జయంతిని నిర్వహించిన ప్రభుత్వం గురజాడను గుర్తించడంలో విఫలమైంది. బహుశా గురజాడ కోరుకున్న దోపిడీ లేని సమాజం పాలకులకు నచ్చలేదోమో. అభ్యుదయ కవులు, రచయితలు, సాహితీవేత్తలు ఓవైపు గురజాడ సాహిత్యాన్ని ప్రచారం చేస్తునే...

మరోవైపు గురజాడ స్వగృహాన్ని అభివృద్ధి చేసి, పరిరక్షణ చర్యలు తీసుకోవాలని, ఆయన జయంతి, వర్ధంతులను ప్రభుత్వ ఆధ్వర్యాన నిర్వహించాలని, గురజాడ దేశభక్తి గేయాలను విద్యాసంస్థల్లో ప్రార్థనా గీతంగా ప్రవేశపెట్టాలని, గురజాడ పేరిట సాంస్కృతిక విశ్వవిద్యాలయాన్ని విజయనగరంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తునే ఉన్నారు.

నేడు గురజాడ గౌరవ యాత్ర

గురజాడ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 30న ఆదివారం విజయనగరంలో జన విజ్ఞాన వేదిక, సాహితీస్రవంతి ఉదయం 8గంటలకు గురజాడ విగ్రహం నుంచి జిల్లా పరిషత్తు హాలు వరకూ గురజాడ గౌరవయాత్ర జరుగుతుంది. 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో 'గురజాడ రచనలు - ప్రాసంగికత'పై నాలుగు సదస్సులు నిర్వహించనున్నారు. ప్రముఖుల స్మారక భవనాలు, చిహ్నాల పరిరక్షణ -కన్యాశుల్కం నాటకం - సామాజిక ప్రయోజనం అనే అంశాలపై సాహిత్య గోష్ఠులు జరుగుతాయి. ఈ సదస్సుల్లో వరుసగా తెలకపల్లి రవి, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, డాక్టర్ మక్కెన శ్రీనివాస్, చీకటి దివాకర్, ఎంవిఎస్ శర్మ, తవ్వా శ్రీనివాస్, డాక్టర్ జి.మురళీధర్‌బీ పీ దేవి, కత్తి పద్మ, రెహనా, డాక్టర్ జి. సన్యాసమ్మ, రమా గీతాదేవి, ఎం.సుశీల, లెక్కల చిన్నారి, ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్, కె.లక్ష్మణరావు, వి.లక్ష్మణరెడ్డి, డాక్టర్ ఎంవిఎస్ వెంకట్రావు, మల్లిపురం జగదీష్, సత్యనారాయణ, కె.త్రిమూర్తులుతోపాటు మాజీ ఎంపీ డాక్టర్ డివిజి శంకరరావు, డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, డాక్టర్ జెసి నాయుడు, డాక్టర్ యార్లగడ్డ బాబూరావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, డాక్టర్ వివిఎస్ ప్రసాద్, రొంగలి పోతన్న, పెద్దింటి అప్పారావు, కెఆర్‌డి ప్రసాదరావు, ఎస్-ఎస్‌ఎస్ రాజు, భీశెట్టి బాబ్జీ గురజాడ గౌరవయాత్రతో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో సుమారు 60కిపైగా సాహిత్య, సాంస్కృతిక, కళా, సామాజిక రంగాలకు చెందిన సంస్థలు భాగస్వామ్యం కానున్నాయి.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు రానివ్వొద్దు

మంత్రి కొండపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో ధాన్యం సేకరణ కేంద్రాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 3.35 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ఏడాది 4 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. గత ఏడాది రైతులకు చెల్లింపులు 48 గంటల్లోగా జరిగాయని, కొన్ని సందర్భాల్లో ఒక గంటలోనే నగదు చెల్లింపులు జరిగినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది నవంబర్‌లోనే సేకరణ ప్రారంభించడంతో ఇప్పటికే సుమారు 30 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు వివరించారు. మిల్లర్లు, ఎఫ్‌సిఐ, పౌర సరఫరాలు, వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ సాఫీగా కొనసాగుతుందని సూచించారు. కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని చిన్న సమస్యలు ఎదురైనా వాటిని వెంటనే పరిష్కరించుకుంటూ సేకరణ ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నిల్వలకు తగిన వసతులు లేకపోవడంతో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్లలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రారంభమైందని, విజయనగరం డివిజన్లో త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. ధాన్యంలో తేమశాతం లేదా వేస్టేజ్ పేరుతో నాలుగు, ఐదు కిలోలు తక్కువ వేయడం సరికాదని హెచ్చరించారు. అవసరమైనచోట కఠిన చర్యలు తీసుకోవాలని తాహశీల్దార్లను ఆదేశించారు. వర్షాలు పడినప్పటికీ ధాన్యం పాడవకుండా 2000 టార్పాలిన్లు సిద్ధంగా ఉంచామని, మరో 1600 టార్పాలిన్లను రాయితీపై ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ముందుగా సంయుక్త కలెక్టర్ సేదు మాధవన్ ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాట్లు, తూనికలు, గోనె సంచుల లభ్యత, పని విధానంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బి.శాంతి, జిల్లా పౌర సరఫరాల అధికారి మురళీధర్, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బి. వెంకట్రావు, ఎఫ్‌సిఐ జిల్లా మేనేజర్ సునీల్ కుమార్, మార్కెటింగ్ ఎడి రవీంద్ర, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేశ్వర రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒత్తిడి పెంచుతాం

ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల సాధనకు కేంద్రంపై డిసెంబర్ 1 నుంచి జరుగనున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పార్టీ సూచన మేరకు ఒత్తిడి పెంచుతామని ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. టిడిపి పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎంపి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనలు, సలహాలను అనుసరిస్తూ కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాల కోసం సమగ్ర వ్యూహంతో ముందుకు వెళ్తామని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రత్యేకించి ఉత్తరాంధ్రకు కావలసిన ప్రాజెక్టులు, నిధుల మంజూరులో మరింత ఒత్తిడి తీసుకువెళ్లేలా టిడిపి సభ్యులంతా సమన్వయంతో పని చేయనున్నట్లు తెలిపారు. విజయనగరం పార్లమెంట్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, కేంద్ర సహకారం పెంపు విషయాల్లో పూర్తి స్థాయిలో కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఇ.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కుష్టు,ఎయిడ్స్, టిబి కంట్రోల్ అధికారిణి డాక్టర్ కె.రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు స్థానిక డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం వద్ద ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీని కలెక్టర్ ఎస్.రాంసుదర్ రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం 11గంటలకు కార్యాలయంలో సమావేశం, మధ్యాహ్నం 1 గంటకు కమ్యూనిటీ లంచ్‌ను ఏర్పాటు చేసినట్లు డాక్టర్ రాణి తెలిపారు.

గురజాడ రచనలు నేటికీ మార్గదర్శకం

సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలకపల్లి రవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, నెల్లిమర్ల

మహాకవి, సామాజిక సంస్కర్త గురజాడ వెంకట అప్పారావు రచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సాహితీస్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి అన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా శనివారం జెఎన్‌టియు జివి, నెల్లిమర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కార్యక్రమాలు నిర్వహించారు. గురజాడ చిత్రపటాలకు నివాళులు అర్పించి, ఆధునిక సమాజానికి ఆయన రచనలు అందించిన శాశ్వత విలువలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి మాట్లాడుతూ గురజాడ సాహిత్యంలోని మానవతా భావాలు, ప్రగతిశీల ఆలోచనలు, సమాజంపై వాటి ప్రభావం గురించి వివరించారు. ముఖ్యంగా స్త్రీ విద్య ప్రాధాన్యం, సామాజిక బాధ్యత, మానవత వంటి గురజాడ ప్రబోధాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. నేడు సమాజంలో కనిపిస్తున్న అనేక సానుకూల మార్పులు గురజాడ లాంటి సాహిత్య మహనీయుల దూరదృష్టి వల్లేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా తెలకపల్లి రవిని, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్‌ను సన్మానించారు. జెఎన్‌టియుజివి తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జి ప్రొఫెసర్ ఎస్‌కె వల్లి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.జె. నాగరాజు, ప్రముఖ న్యాయవాది ఎస్ఎస్ఎస్ఎస్. రాజు, మాజీ వీసీ డాక్టర్ డి. రాజ్యలక్ష్మి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రేఖ, ఐ.క్యూ.ఎ.సి కోఆర్డినేటర్ డాక్టర్ జివిఎస్ జయపాలరావు, అధ్యాపకులు డాక్టర్ ఎం. హేమ, డాక్టర్ జి. అప్పలనాయుడు, ఎన్. వెంకటేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కవులకు సత్కారం

విజయనగరం టౌన్ : మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక గురజాడ పాఠశాలలో ముగ్గురు ప్రజాకవులు మల్లిపురం జగదీష్, పక్కి రవీంద్ర, గంట్రేటి శ్రీనివాసరావులను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్. కృష్ణాజీ మాట్లాడుతూ సత్కారాన్ని పొందిన ఈ ముగ్గురు కవులు ప్రజాసమస్యలపై ప్రత్యేకంగా గిరిజన వర్గాల సమస్యలపై అనేక రచనలు చేసి మన ఉత్తరాంధ్రలో పేరు సంపాదించారని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.స్వరూప, రచయిత ఎన్‌కె బాబు, పాఠశాల హెచ్‌ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా మరుగుదొడ్ల నిర్మాణం

కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం

సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని డిసెంబరు నెలాఖరునాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణంపై జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్లో శనివారం సమీక్ష నిర్వహించారు. బిసి సంక్షేమ వసతి గృహాల్లో 39, సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో 51, ఎపి గురుకులాల్లో 28, అంగన్‌వాడీ కేంద్రాల్లో 147, గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో 26, మొత్తం 291 మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశామని చెప్పారు. వీటిలో 89 మరుగుదొడ్ల నిర్మాణం సాధ్యం కాదని రద్దు చేయడం జరిగిందన్నారు. మిగిలినవాటిలో 35 మరుగుదొడ్లు పూర్తి అయ్యాయని, 119 నిర్మాణంలో ఉన్నాయని, ఇంకా 48 ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతంలో ఉన్న 21న మరుగుదొడ్లను పబ్లిక్ హెల్త్ ద్వారా నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 119 మరుగుదొడ్లను డిసెంబరు 15 నాటికి, మిగిలిన వాటి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, సాంఘిక సంక్షేమశాఖ డిడి అన్నపూర్ణ, బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం నింపాలి

ఎస్‌పి ఎఆర్ దామోదర్

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాల పట్ల ప్రజల్లో చైతన్యం నింపాలని ఎస్‌పి ఎఆర్ దామోదర్ సూచించారు. వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులతో శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా కోర్టులో డిసెంబరు 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా పోలీసు అధికారులు ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయాలని, సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. ఇకపై దర్యాప్తు చేపట్టే అన్ని కేసుల్లోను ఈ-సాక్ష్య యాప్‌ను వినియోగించాలని, ఫోటోలను, వీడియోలను నిక్షిప్తం చేయాలన్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో నిర్దిష్ట సమయంలోగా న్యాయస్థానాల్లో నిందితులపై అభియోగ పత్రాలు దాఖలు చేయాలన్నారు. ప్రజలకు రహదారి, సైబరు, మహిళల భద్రత పట్ల క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధారణ, డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగుపై ప్రత్యేక దృష్టి పెట్టి, కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేయాలని, ఆర్టీసి కాంపెక్సులు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన జంక్షన్లలో నిఘా పెట్టాలని సూచించారు. వివిధ పోలీసు స్టేషనుల్లో నమోదై, దర్యాప్తులో ఉన్న చోరీ కేసులను ప్రత్యేకంగా సమీక్షించి, ఆయా కేసుల్లో పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. గ్రామ స్థాయిలో గంజాయి సేవించే వారిని గుర్తించి, వారికి గంజాయిని విక్రయించే వారి వివరాలు రాబట్టి, వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, డిఎస్‌పిలు ఆర్.గోవిందరావు, జి.భవ్య రెడ్డి, ఎస్.రాఘవులు, వీరకుమార్, న్యాయ సలహాదారులు వై. పరశురాం, పలువురు సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తైక్వాండోలో జిల్లాకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21 నుంచి 23 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలిలో జరిగిన సీనియర్ , క్యాడిట్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని తైక్వాండో జిల్లా అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు తెలిపారు. విజయనగరం జిల్లా నుండి ఐదుగురు క్రీడాకారులు 8 పతకాలు సాధించారన్నారు.కె.సాహిత్య ఒక గోల్డ్ , ఒక బ్రాంజ్ పతకాలు, వై. చరిష్మా రెండు బ్రాంజ్ పతకాలు, టి.సంకీర్తన రెండు బ్రాంజ్ పతకాలు, వై.ముఖేష్ విశ్వనాథ్ ఒక బ్రాంజ్ పతకం, వి. దేవన్ మణికంఠ ఒక బ్రాంజ్ పతకం సాధించారు. శనివారం జరిగిన అభినందన సభలో క్రీడాకారులను వారు అభినందించారు. గెలుపొందిన క్రీడాకారులకు ట్రాక్‌సూట్ బహుకరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు , రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాల్ రావు , సైక్లింగ్ అసోషియన్ అధ్యక్షులు ఎంఎస్ ఎన్ రాజు , కోచ్ యశస్విని పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్‌ను వినియోగించుకోండి

విజయనగరం టౌన్ : అక్రమ నిర్మాణాలు, లే అవుట్లు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్ ఎస్, బిపిఎస్ ద్వారా అవకాశం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, నగర పాలకసంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శనివారం కార్యాలయంలో ప్రణాళిక సిబ్బంది, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లను ఆక్రమించడం, భవనాలు నిర్మాణాలు ప్లాన్ ప్రకారం కాకుండా డీవేయేషన్ చేసి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అక్రమ నిర్మాణాలు కూడా రెగ్యులైరేజ్ చేసే విధంగా ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ ద్వారా రెగ్యులర్ చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత పాల్గొన్నారు.

అండర్ - 14 రాష్ట్ర క్రికెట్ జట్టు పరిశీలకులుగా బంగార్రాజు

విజయనగరం టౌన్ : అండర్ - 14 స్కూల్ గేమ్స్ రాష్ట్ర క్రికెట్ జట్టు పరిశీలకులుగా గాజులరేగ జెడ్‌పి ఉన్నత పాఠశాల పిఇటి పెనుమత్స బంగార్రాజును నియమిస్తూ డిఇఒ ఉత్తర్వులు జారీచేశారు. గుంటూరు జిల్లా పెరిచర్లలో ఈ నెల 29 నుంచి 30 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలను ఆయన పరిశీలించనున్నారు.

1న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎండిఎంకు వంట గ్యాస్ ఇవ్వాలని

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని కోరుతూ డిసెంబర్ 1న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు ఎపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. శనివారం స్థానిక ఎన్‌పిఆర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో గ్యాస్‌తో వంటలు చేయాలని ఆదేశించారని తెలిపారు. ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయకుండా ఇస్తున్న 6, 8 రూపాయలతో గ్యాస్ కొనుగోలు చేసి ఎలా వండి పెట్టగలరని ఆమె ప్రశ్నించారు. మరో వైపు నూనెలు,పప్పులు ధరలు పెరిగిపోతుంటే ఇస్తున్న మెనూ ఛార్జీలు మాత్రం ప్రభుత్వం పెంచడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగామెనూ ఛార్జీలు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. మరో 25 ఏళ్లగా బిల్లులు రాకపోయినా పుస్తులు అమ్మి సామాజిక దృక్పథం తో వండి పెడుతున్న ఈ పథకాన్ని స్మార్ట్ కిచెన్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. స్మార్ట్ కిచెన్ పద్ధతిని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా గోడ పత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎ.జగన్ మోహనరావు, బి.రమణ పాల్గొన్నారు.

కెజిబివి టీచర్లకు ఎంటిఎస్ అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కెజిబివిల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. స్థానిక కోటలో శనివారం ఎమ్మెల్యే బేబినాయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెజిబివి టీచర్లకు ఎంటిఎస్ అమలు చేస్తామని 2017లో టిడిపి ప్రభుత్వం ప్రకటించినా అమలు చేయలేదన్నారు. విద్యారంగ అభివృద్ధిలో కెజిబివి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నా కనీస వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంటిఎస్ అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కెజిబివి టీచర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కెజిబివి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు, కెజిబివి ఉపాధ్యాయులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : మంత్రి

రైతుల సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సామాజిక పింఛన్లు, ఇళ్లు, రుణాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ పలువురు వినతులు అందజేశారు. పురిటిపెంటలో సుమారు వంద మందికి పైగా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు రాకపోవడంతో నిధులు మంజూరు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆ గ్రామ టిడిపి నాయకులు గొర్లె బంగారునాయుడు, గంట్రేటి ఆదిలక్ష్మి మంత్రికి వినతిపత్రం అందజేశారు. తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన విజినిగిరి అప్పలనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం చేయాలని అతని భార్య ఆదిలక్ష్మి మంత్రికి వినతి పత్రం అందజేసింది. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి వారం మండల పార్టీ అధ్యక్షులు ఒకరోజు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజాదర్బార్ నిర్వహిస్తారని, వారి దృష్టిలో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకుని వస్తారని చెప్పారు. అనంతరం మంత్రి ఐదు మండలాలకు చెందిన 13మందికి సిఎం సహాయనిధి కింద రూ.14,07,297 చెక్కులను లబ్ధిదారులకు స్థానిక నేతలు ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు, మండల పార్టీ అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు లెంక బంగారు నాయుడు, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, వివి ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో పెచ్చుమీరుతున్న ఆగడాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాను రాను రెవెన్యూలో అవినీతి, అక్రమాలు, ఆగడాలు పెచ్చుమీరుతున్నాయా? అంటే ఔను అన్నట్టుగానే బయటపడుతున్నాయి వరుస సంఘటనలు. దీంతో, ఏ పని కావాలన్నా చేతులు తడపాల్సి వస్తుందంటూ జనం బెంబేరెత్తిపోతున్నారు. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలకు తోడు గతంలో జరిగిన కొన్ని సందర్భాలు ఇందుకు తార్కాణంగా జనం ఉదహరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం విజయనగరం తహశీల్దార్‌పై పలు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు అవినీతి ఆరోపణలు చేసిన సంగతి విధితమే. దీనిపై ఈనెల 24వ తేదీన కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళి బహిరంగ విచారణ కూడా చేశారు. దీనికి కొద్దిరోజులు ముందే కొత్తవలస తహశీల్దార్ అవినీతి ఆరోపణలతో సస్పెండ్‌కు గురయ్యారు. ఆయనగారైతే ఏకంగా బంజరుభూములను లేని ఖాతాలు సృష్టించి మరీ ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేశారట. ఇటువంటి ఆరోపణలతోనే చర్యలకు గురయ్యారు. ఇంకాస్తా నెలరోజులు ముందుకు వెళ్తే ప్రభుత్వ భూముల పరిరక్షణలో విఫలమయ్యారని, అక్రమాలకు సహకరించారనే ఆరోపణలతో ఇద్దరు తహశీల్దార్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇలా ఒకటా... రెండా... విఆర్‌ఒల స్థాయిలో అయితే అడ్డూ ఆపూ లేకుండా అక్రమాలు సాగుతున్నాయని జిల్లాలో పబ్లిక్‌టాక్. చివరికి భోగాపురం మండలంలో ఏకంగా రికార్డుల ట్యాంపరింగ్ కూడా జరిగిపోయింది. దీనిపై అప్పటి కలెక్టర్ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక కూడా పంపినట్టు సమాచారం. ఇంకోవైపు తాత తండ్రుల నాటి భూములు, కష్టపడి సంపాదించుకున్న భూములు రక్షించుకోవానికి రెవెన్యూ కార్యాయాల చుట్టూ తిరుగుతున్నవారు కోకొల్లలుగా ఉన్నారు. భూముల వివరాలు ఆన్‌లైన్ పేరిట 2014 -19 మధ్య అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన వెబ్ ల్యాండ్ మొదలుకుని 2019 తరువాత నిర్వహించిన జగనన్న భూ సురక్ష - శాశ్వత భూహక్కు పేరిట సర్వే, తాజాగా కూటమి ప్రభుత్వం దానికి కొనసాగింపుగా చేస్తున్న రీసర్వేల వల్ల తాము ఇబ్బందులు పడుతున్నాము తప్ప ఒరిగిందేమీ లేదని జనం చర్చించుకుంటున్నారు. గతంలో పాతిన సరిహద్దు రాళ్లపై అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి తన పేరు రాయించుకోవడంతోపాటు ఫోటో ముద్ర కూడా వేయించుకున్నారు. ఇందుకోసం రూ.కోట్ల ధనం దుర్వినియోగం చేశారు. నేటి ప్రభుత్వం ఆ పేర్లను, ఫోటోలను చెరిపేందుకు కూడా రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ సంగతి కాస్త అటుంచితే, నాటి టిడిపి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ స్వల్ప సమయంలో వెబ్‌ల్యాండ్ పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బంది మెడపై కత్తిపెట్టింది. ఈ ఒత్తిడి నుంచి బయటపడేందుకు విఆర్‌ఒ స్థాయిలో రెవెన్యూ సహాయకులు లేదా గ్రామంలో బాగా తెలిసిన వ్యక్తులను పక్కన బెటటుకొని ఇష్టారాజ్యంగా, తప్పుల తడకగా నమోదు చేశారు. దీంతో, ఒకరి భూమి ఒకరికి, సెంటు భూమి లేనివారికి పదులు, వందల ఎకరాలు ఉన్నట్లు, తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములు సెంటు భూమి లేనట్లు నమోదయ్యాయి. మారిన పరిస్థితులను బట్టి కనీసం బ్యాంకులో వ్యవసాయ రుణం పొందాలన్నా పూర్వకాలంలో ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకం కన్నా ఆన్‌లైన్‌లోవున్న 1బికే విలువ ఎక్కువైంది. దీంతో, ముఖ్యంగా రైతులు వ్యవసాయ రుణాలు పొందలేని పరిస్థితి. భూ క్రయ, విక్రయాలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడింది. ఏకంగా రిజిస్ట్రేషన్లే నిలిచిపోయే పరిస్థితి. వాటిని సరిచేయాలంటే తిరిగి విఆర్‌ఒ మొదలుకుని ఆర్‌ఐ, తహశీల్దార్ సంతకాలతో కూడిన అప్రూవల్ చేయాలి. పొరపాటు, తప్పులు సహజం. ఈ మాటకొస్తే ప్రతి తప్పును లేదా పొరపాట్లను సరిచేసుకోవడానికి కూడా అవకాశం ఉంటుంది. ఇందుకు అనుగుణంగా వెబ్‌ల్యాండ్‌లో దొర్లిన తప్పులను సరిచేసే అవకాశం, బాధ్యత కూడా ప్రభుత్వం కల్పించింది. కానీ, ఇక్కడ తప్పులు, పొరపాట్లు చేసిన విఆర్‌ఒ లేదా ఇతర సిబ్బంది, అధికారులే తిరిగి వాటిని మరింత జఠిలం చేసి మరీ భూ యజమానుల్ని ముప్పు తిప్పలు పెడుతున్నారని జనంలో చర్చ ఉంది. మ్యుటేషన్ పెట్టాలంటే డబ్బు, వాటిని అప్రూవల్ చేయాలంటే డబ్బులు, మధ్యలో ఆ ఫైల్ ఆన్‌లైన్‌లో కదలాలంటే డబ్బు ఇవ్వాల్సిందే. ఇలా రోజులు, నెలలు, ఏళ్లు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో జనం డబ్బులు ఇవ్వడానికి కూడా అలవాటు పడిపోవాల్సిన దుస్థితి దాపురించిందని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

పేదల ఇళ్లకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫూల్‌బాగ్ పీజీ కాలేజీ ఎదురుగా ఉన్న పేదల ఇళ్లకు పన్నులు వేయాలని, పట్టాలివ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం 2వ వార్డులో గల సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ గత 59 ఏళ్లుగా ఫూల్‌బాగ్ పీజీ కాలేజీ ఎదురుగా పూరిళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న పేదలకు ఇంతవరకు ఇంటిపన్నులు వేయలేదన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా విద్యుత్ వచ్చిందన్నారు. 2004 లో సర్వే చేసి, పట్టాలిస్తామని రెవెన్యూ మున్సిపల్ అధికారులు చెప్పి ఇప్పటికీ ఆచరించ లేదన్నారు. రోజువారి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలైన వీరికి పన్నులు వేయకపోవడం, పట్టాలు ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. ఇప్పటి ప్రభుత్వం ఇచ్చిన జి.ఒ నెంబర్ 30 ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో దాలయ్య, సన్నీ, రాజు పేదలు తదితరులు పాల్గొన్నారు.

రావివలస రెవెన్యూలో అక్రమ లేఅవుట్

ప్రజాశక్తి-చీపురుపల్లి

రావివలసలో ఏర్పాటుచేసిన లేఅవుట్ ఇదే

చీపురుపల్లి కేంద్రంగా అక్రమ భూదందా వ్యాపారాలు కొన సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రావివలస రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164లో 10 నుంచి 27 వరకు, సర్వే నెంబరు 106లో 1,2,3,4 భాగాల్లో సుమారు 12 ఎకరాల్లో శ్రీకనకమహాలక్ష్మి టౌన్‌షిప్ పేరుతో లేఅవుట్ ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండానే ఈ లేఅవుట్ ఏర్పాటుచేసినట్లు తెలిసింది. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని రావివలస రెవెన్యూ పరిధిలో ఏర్పాటుచేసిన ఈ లేఅవుట్‌పై తహశీల్దార్ డి.ధర్మరాజును వివరణ కోరగా, తమ వద్ద నుంచి ఎటువంటి అనుమతులను ఇవ్వలేదని వివరించారు. పంచాయతీ నుంచి కూడా శ్రీకనకమహాలక్ష్మి టౌన్‌షిప్‌కు అనుమతులు మంజూరు చేయలేదని ఎంపిడిఒ ఐ.సురేష్ స్పష్టంచేశారు. తమ సిబ్బందిని పంపించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

విద్యుత్ ఇక్కట్లకు ఇక చెల్లు

ప్రజాశక్తి- మెరకముడిదాం

సోమలింగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగకుండా 24 గంటలూ సరఫరా చేసేందుకు ఈపిడిసిఎల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బ్రేకర్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా అంతరాయానికి చెక్ పెట్టినట్లు అయింది. ఈ బ్రేకర్ ఏర్పాటు చేయకముందు తెర్లాం వెళ్లే 33 కెవి లైన్‌లో ఎటువంటి అంతరాయం కలిగినా సోమలింగాపురం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు అంధకారంలో మగ్గుతుండేవి. ఇక నుంచి విద్యుత్ నిరంతర సరఫరా కానుండటంతో ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో డిఇ త్రినాథ, ఎడిఇ కె.ప్రసాద్, ఎఇ దివాకర్ పాల్గొన్నారు.

జిందాల్ భూసేకరణ వివరాలు బయటపెట్టండి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఎస్.కోట మండల పరిధిలోని బొడ్డవర ప్రాంతంలో జిందాల్ అల్యూమినా కర్మాగారం కోసం 1128 ఎకరాలను 2008లో భూ సేకరణ చేసి ప్రభుత్వం జిందాల్ కర్మాగారానికి అప్పచెప్పిందని వీటి వివరాలు జిల్లా అధికారులు ప్రజలకు,రైతులకు తెలపాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. ఈమేరకు కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిందాల్ భూ సమస్యల పరిష్కార ప్రత్యేక అధికారి ఇ. మురళికి వినతి అందజేశారు.

పలువురికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని జగన్నాథవలస గ్రామంలో ఇటీవల అనారోగ్య కారణంగా దేవరాపు సత్యం, పీసా శ్రీనివాసరావు మృతి చెందారు. శనివారం వారి కుటుంబ సభ్యులను వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పరామర్శించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు రామారావు, తెంటు సత్యంనాయుడు, వైస్ ఎంపిపిలు సత్యనారాయణ, అప్పలరాజు, వెంకట్రావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మొయిద నారాయణ పట్నంలో వైసిపి నాయకులు పెద మజ్జి అప్పలనాయుడు మృతి చెందడంతో ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు వారి కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధవల లక్ష్మణరావు, యువజన నాయకులు సూరినాయుడు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా గ్రామకంఠాలపై సర్వే

రేగిడి : గ్రామకంఠాలపై సర్వే సమర్థవంతంగా నిర్వహించి, కచ్చితమైన నివేదికలు అందజేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెవివి జగన్నాథం సూచించారు. మండలంలోని ఒప్పంగిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో చేపట్టిన స్వామిత్వ సర్వేపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్వేలకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామకంఠంలో ఎంత భూమి ఉందో కచ్చితంగా విస్తరణ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా మోహన్‌రావు, ఎంపిటిసి గంటా శకుంతలమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

'విశాఖ స్టీల్‌ప్లాంట్ - భవిష్యత్'పై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

జామి : విశాఖ స్టీల్‌ప్లాంట్ - భవిష్యత్ అనే అంశంపై జామి చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీసీతారామ కల్యాణ మండపంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ బివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే, ఈ ప్రాంత యువత ఉపాధి అవకాశాలకు ప్రమాదం వాటిల్లుతుందని చెప్పారు. దీనిపై అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల నాయకులు, యువత, మేధావులు చర్చించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

సుందరపేట సిహెచ్‌సిలో పరిశుభ్రత

భోగాపురం : ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదేశాల మేరకు సుందరపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పారిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లు త్రినాథ్, కొండపు రాధాకృష్ణారెడ్డి, మాత నవీన్ పర్యవేక్షణలో పనులు చురుగ్గా సాగుతున్నాయి. హాస్పిటల్ పరిసరాల్లో అపరిశుభ్రంగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరిచారు. రానున్న రోజుల్లో మొక్కలు నాటి, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

చీపురుపల్లి : చీపురుపల్లిలో చైతన్య భారతి ప్రవహిన్స్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఒ.ఉపేంద్ర, ఎసిటిసి కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, ఎఎన్‌ఎం లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. మానవీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బివి గోవిందరాజులు సారథ్యంలో పలు ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ఎయిడ్స్‌పైన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య అధికారి తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లు రద్దు చేయాలి

విజయనగరం టౌన్ : ఆన్‌లైన్ బెట్టింగ్‌యాప్‌లను రద్దు చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత, ఆడపిల్లలపై ప్రమాదకరంగా మారిన ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. యాప్‌లను రద్దుచేసి యువతను, ఆడపిల్లలను రక్షణ కల్పించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గుర్ల

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. శుక్రవారం సాయంత్రం చుక్కపేట సెంటర్ వద్ద కలవర్తి గ్రామానికి చెందిన నడుపూరు నరసయ్యమ్మ (65) ప్రమాదవశాత్తూ బైక్ మీద నుంచి కింద పడింది. ఆమె తలకు బలమైన గాయం కావడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శనివారం ఆమె మరణించింది. శనివారం ఎస్‌ఎస్‌ఆర్ పేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మృతుడిది చీపురుపల్లికి చెందిన ఇప్పిలి భూషణరావు (48)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

రైతులకు భరోసా కల్పిస్తున్నాం

'రైతన్నా మీకోసం'లో మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-గంట్యాడ

రైతులకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని రావివలస గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులకు అన్నదాత సుఖీభవ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, పిఎం కిసాన్ ద్వారా కేంద్రం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. పంటల సాగుకు అవసరమైన పనిముట్లపై 90శాతం రాయితీని ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి కంపెనీలను తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గోపాలరాజు, తహశీల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి, వ్యవసాయ శాఖ ఎడి నాగభూషణం, ఎఒ శ్యామ్‌కుమార్, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కర నాయుడు, అల్లు విజయ్, తాటిపూడి ఆయకట్టు చైర్మన్ కళ్లెంపూడి జగన్నాథం, టిడిపి నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ.. మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ; వేపాడ.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామంలో నిర్వంచిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని, రైతులతో మాట్లాడారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అలవాటు చేసుకోవాలని, డిమాండ్ ఉన్న పంటలను పండించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ స్వాతి కుమారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ హక్కు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యమని మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శనివారం కొండవెలగాడలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, సీనియర్ నాయకులు దంతులూరి అజయ్‌బాబు, మొయిద శ్రీను, కాళ్ళ రాజశేఖర్ పాల్గొన్నారు.

2న అండర్- 12 క్రికెట్ జట్టు ఎంపికలు

విజయనగరం టౌన్ : వచ్చే నెల 2న విజ్జి స్టేడియంలో అండర్ - 12 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామనిజిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు 2013 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒరిజినల్ జనన, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకు రావాలని తెలిపారు.

అబాకస్ పోటీలో విద్యార్థుల హవా

విజయనగరం టౌన్ : ఈనెల 16న జరిగిన 36వ అంతర్జాతీయ ఆనలైన్ అమట అబాకస్ పరీక్షా ఫలితాల్లో ది వైజాగ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కె.అదితి తేజ్ ఛాంపియన్ అవార్డును, ట్రోఫీని గెలుచుకున్నారు. బహుమతులను పొందిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సీతయ్య, డైరెక్టరు వీరాస్వామి, పాఠశాల ప్రిన్సిపాల్ బి. లక్ష్మణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, గణిత ఉపాధ్యాయులు కాశీవిశ్వనాధ్, ఆదిత్య కల్యాణ్ అభినందించారు.

పనితీరేం బాగోలేదు

మండల సమావేశంలో వివిధ శాఖలపై సభ్యుల అసంతృప్తి

ప్రజాశక్తి-రామభద్రపురం

మండలంలో పనిచేస్తున్న వివిధ శాఖల పనితీరుపై సభ్యులు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. గ్రామాల్లో అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రొంపల్లి ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు మాట్లాడుతూ రొంపల్లిలో అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం 11 గంటలైనా కేంద్రాలు తెరవకపోవడంతో పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోలేదని ఐసిడిఎస్ అధికారులను నిలదీశారు. దీనిపై ఐసిడిఎస్ పిఒ వరహాలమ్మ మాట్లాడుతూ నిర్లక్ష్యం చూపిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రామభద్రపురంలోని గొల్లవీధిలో తాగునీటి సమస్య ఉందని, వెంటనే పరిష్కరించాలని ఎంపిటిసి సభ్యులు భవిరెడ్డి చంద్ర కోరారు. ఎగువ దళితవీధిలో పాఠశాల మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యాశాఖాధికారుల దృష్టికి తెచ్చారు. చిన్నమ్మతల్లి గుడి వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీనిని సరిచేయాలని ఎంపిటిసి సభ్యులు వసంతల తిరుపతిరావు కోరారు. సిఎస్ డిటి సాయికృష్ణ మాట్లాడుతుండగా, ఎంపిటిసి భవిరెడ్డి చంద్ర జోక్యం చేసుకుని, రొంపల్లిలో డీలర్లు రేషన్ సరుకులు సరిగా ఇవ్వడం లేదన్నారు. 20 కిలోలకు 15 కిలోలే ఇస్తున్నారని, ఎన్నో ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు సరిగా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిపై విచారణ చేయిస్తామని తహశీల్దార్ అజురఫీజాన్ హామీ ఇచ్చారు. ఆశా వర్కర్ల పనితీరు బాగోలేదని పాతరేగ ఎంపిటిసి సభ్యులు మడక తిరుపతినాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. డయేరియాపై ప్రజలను అప్రమత్తం చేయడంలో వైద్య సిబ్బంది విఫలమయ్యారని ఆరోపించారు. మండలంలో మోడల్ చెరువుల ఆధునీకరణకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఉపాధిహామీ అధికారులను నిలదీశారు. అటువంటప్పుడు ఎమ్మెల్యేతో ఎందుకు శంకుస్థాపన చేయించారని ప్రశ్నించారు. అనంతరం మండల బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు అప్పికొండ సరస్వతి, ఎంపిడిఒ రత్నం, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఎఒ అమరా శివ, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

తూతూ మంత్రంగా బడ్జెట్ సమావేశం

ప్రజాప్రతినిధులు గైర్హాజరు

ప్రజాశక్తి- మెంటాడ

మాట్లాడుతున్న ఎంపిడిఒ సుదర్శన్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల బడ్జెట్ సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపిడిఒ పి.సుదర్శన్ ఆధ్వర్యంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అధికారులు కొంతవరకు హాజరైనప్పటికీ ప్రజాప్రతినిధులు పదిమంది తప్ప మిగతా వారు గైర్హాజరయ్యారు. గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన అభివృద్ధి పనుల అమలు, పురోగతిపై శాఖల వారీగా అధికారులు వివరించారు. వ్యవసాయ, హౌసింగ్, ఆర్అండ్‌బి శాఖలకు సంబంధించిన అధికారులు గత మూడు నెలల్లో చేసిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులను వివరించారు. ఆ సమయంలో ప్రజాప్రతినిధులు వాటిపై ప్రశ్నించి, సమస్య పరిష్కారం దిశగా సమాధానాలు రాబట్టారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో బాల్యవివాహాలు నివారించేందుకు ప్రజాప్రతినిధుల అందరి సహకారం అవసరమన్నారు. అనంతరం ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ ఎంతో ప్రాధాన్యత కలిగిన సమావేశానికి చాలామంది ప్రజాప్రతినిధులు, కొంతమంది అధికారులు హాజరు కాకపోవడం విచారకరమన్నారు. వారికి నోటీసులు పంపిస్తామన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, డిప్యూటీ డిఇఒ కె.మోహన్‌రావు, ఎంఇఒ వర్మ, ఎపిఎం అన్నపూర్ణ, ఎపిఒ చిన్నప్పయ్య, పంచాయతీ రాజ్ శాఖ ఎఇ గౌతమ్, మెంటాడ పిహెచ్‌సి వైద్యులు కల్పన, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలొద్దు

ఎమ్మెల్యే హుందాగా ఉండాలి : వైసిపి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి గ్రామ సందర్శనల పేరుతో అవాస్తవ ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని వైసిపి నేతలు మండిపడ్డారు. వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం పూసపాటిరేగ కార్యాలయంలో వైస్ ఎంపిపిలు అల్లాడ సత్యనారాయణమూర్తి, ఎన్.సత్యనారాయణ, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మహంతి జనార్దన్ రావు, ఎంపిపి ప్రతినిధి మహంతి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కాలువలు, రోడ్లు, లైట్లు లేవంటూ, అభివృద్ధి శూన్యమంటూ ఎమ్మెల్యే పర్యటించడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యని విమర్శించారు. అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వకుండా వైసిపి నేతలు అడ్డుపడుతున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అల్లాడపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాన్ని జనసేన కార్యక్రమంలా నిర్వహించడం విచారకరమన్నారు. కొంతమంది అధికారులను తమ ఇష్టానుసారం వాడుకుని అధికారం చెలాయిస్తామని ఎమ్మెల్యే భావిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

ఎన్నికల ముందు ఎమ్మెల్యే నాగమాధవి.. 100 కంపెనీలు తెస్తానని చెప్పి యువతను మోసం చేశారని ఆరోపించారు. మీరు అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పగలరా? అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. అభివృద్ధిపై చర్చకు తాము ఎప్పుడూ సిద్ధమని ప్రకటించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించాలని హితవుపలికారు. అంతేతప్ప ఊరూరా సమావేశాలు పెట్టి ప్రజాప్రతినిధులను దూషిస్తే సహించబోమని హెచ్చరించారు.

ఫూల్‌బాగ్ రోడ్డు 60 అడుగులకు తగ్గించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్

ప్రజాశక్తి-బొబ్బిలి

మాస్టర్ ప్లాన్‌లో ఫూల్‌బాగ్ రోడ్డు 100 అడుగులతో ప్రతిపాదనలు చేశారని, 60 అడుగులకు తగ్గించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీ కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ రాంబార్కి శరత్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మాస్టర్ ప్లాన్‌లో 100 అడుగులు ఉండడంతో ఇళ్లకు నష్టమని, నిత్యం రద్దీగా ఉన్న బలిజిపేట రోడ్డు 52 అడుగులు మాత్రమే ఉందని, ఫూల్ బాగ్ రోడ్డు 60 అడుగులకు తగ్గించాలని మురళీ కోరారు. దీనిపై కమిషనర్ రామలక్ష్మి స్పందిస్తూ చైర్మన్‌తో చర్చించి ఆ దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మురికివాడల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలని కౌన్సిలర్ జి.రమాదేవి కోరారు. తమ వార్డులో తాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుళాయిలు వేయాలని కోరారు. మార్కెట్లో రోడ్డు, చినబజారులో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని టిడిపి కౌన్సిలర్ గెంబలి శ్రీనివాసరావు కోరారు. అనకాపల్లి కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వకుండా లోకల్ కాంట్రాక్టర్లకు అప్పగించాలని చెలికాని మురళీ కోరారు. పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని వినియోగించాలని కోఆప్షన్ సభ్యులు ఖాన్ కోరారు. పట్టణంలో పారిశుధ్యం సక్రమంగా లేదని కౌన్సిలర్ బి.శ్రీదేవి ప్రస్తావించారు. మున్సిపాలిటీలో గతంలో నూతనంగా నియమించిన ఉద్యోగులను డిఇ వేధించడం సరికాదని కౌన్సిలర్ ఇంటి గోవిందరావు అన్నారు. పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ రాజారావుకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉద్యోగిపై దాడి అనాగరిక చర్య

ప్రజాశక్తి-వంగర

శ్రీహరిపురం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ బోనెల మహేష్‌పై జరిగిన దాడిని డెమోక్రటిక్ జెఎసి తీవ్రంగా ఖండించింది. శనివారం ఎంపిడిఒ రాజారావును జెఎసి సభ్యులు కలిసి వినతి అందజేశారు. సంఘటన వివరాలను తెలియజేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా డెమోక్రటిక్ జెఎసి ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం, ప్రజల మధ్య కీలక వారధులుగా పనిచేస్తారని తెలిపారు. విధుల్లో నిమగ్నమైన ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం దారుణమన్నారు. సమస్యలుంటే అవి చర్చల ద్వారా లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అంతే కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సిబ్బందిపై దాడులు చేయడం అనాగరికతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ల జిల్లా ఉపాధ్యక్షులు ఆశపు వైకుంఠరావు, మండల అధ్యక్షులు బొత్స సంతోష్ పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి ఫలాలే పార్టీకి రక్ష

ప్రజాశక్తి-గుర్ల

ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలే పార్టీకి శ్రీరామరక్షని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. మండలంలోని పాలవలసలో టిడిపి బూత్ కన్వీనర్లు, గ్రామ నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధించబోతుందని రాజారావు చెప్పారు. టిడిపి మండల అధ్యక్షులు చనమల మహేశ్వరరావు మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలోఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర రమణమూర్తి, నాయకులు వల్లూరు బంగారునాయుడు, గేదెల అప్పలనాయుడు, సుంకరి ఉపేంద్ర, వల్లూరు చిన్నంనాయుడు, తాడి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

వంగర : ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టిడిపి రాష్ట్ర పరిశీలకులు చౌదరి నారాయణమూర్తి (బాబ్జి) పార్టీ శ్రేణులకు సూచించారు. మండలంలోని శివ్వాం, వంగరలో ఆయన శనివారం పర్యటించారు. మండల నాయకులతో చర్చించి సార్వత్రిక ఎన్నికల్లో ఏయే బూతుల్లో మెజార్టీ తగ్గింది, అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో దీనిని అధిగమించడానికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో బొత్స వాసుదేవరావు నాయుడు, లచ్చుభుక్త ధనలక్ష్మి కృష్ణమూర్తి, పిన్నింటి మోహనరావు, మజ్జి గణపతి, బెజ్జిపురపు రవి, చింత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

నెల్లిమర్ల : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సతివాడ సర్పంచ్ రేవల్ల శ్రీను, ఎంపిటిసి రెడ్డి సత్యనారాయణ కోరారు. శనివారం సతివాడలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు. వైద్య విద్య, వైద్యం పేదలకు దూరం చేయొద్దని డిమాండ్ చేశారు.

గుర్ల : గుర్ల మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ కుమార్తె డాక్టర్ బొత్స అనూష ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధానకార్యదర్శి కె.వి.సూర్యనారాయణ, ఎంపిపి ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, మధుసూదన్, స్వామినాయుడు, తిరుపతిరావు పాల్గొన్నారు.

రసాయన అగరుబత్తులను వాడవద్దు

విజయనగరం కోట : రసాయనాలతో తయారు చేసిన అగరబత్తులను వాడవద్దని మండల వ్యవసాయ అధికారి అడ్డూరి శ్రీనివాస్ తెలిపారు. స్లీప్‌వెల్ అగర్‌బత్తి స్టిక్‌లో మెపర్‌ఫ్లుత్రిన్ అనే క్రిమిసంహారకం కలపడంతో పీల్చిన వారిలో శ్వాస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీంతో ఈ ఉత్పత్తి అమ్మకాలు నిలిపేసినట్లు తెలిపారు. మారుతి జనరల్ స్టోర్‌లో రూ.8వేలు విలువైన సరుకుల అమ్మకాలు నిలిపేయాలని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

EP NO. 01/2023 in OS NO.31/2016

DHR/వాది : వావిలపల్లి రామకృష్ణ

JDR/ప్రతివాది: సురవరపు కృష్ణారావు

పై నెంబరు అమలు పైకం రాబట్టే నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి జప్తు కాబడి సదరు కోర్టు వారి ఎదుట తే 16-12-2025ది ఉదయం గం|| 10-30 నుండి బహిరంగ వేలం కాబడును.

సదరు స్థిరాస్తి వివరములు : 1వ ప్రతి:- అమలు షెడ్యూలు దాఖలా ఖాళీ నివేసన స్థలం స్థిరాస్తి మందరాడ గ్రామం, సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతము విజయనగరం జిల్లా in sy no 153 తూ|| 13 1/2 అడుగులు, ఉ|| దక్షి - 75 అడుగులు గల ఖాళీ స్థలనకు హద్దులు తూ|| వావిలపల్లి పార్వతి, డాబా ఇల్లు ద|| CC Road, ప|| వాలపల్లి జయమ్మ డాబాఇల్లు, ఉ|| కాకరపల్లి గ్రామ బౌండరీ,

2వ ప్రతి: అమలు షెడ్యూలు దాఖలా డాబా కొట్టుగది, కాకరాపల్లి గ్రామం, సంతకవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతము విజయనగరం జిల్లా. Sy no 12/2P door No. 3-90 తూ|| ప|| 16 అడుగులు ఉ|| ద|| 9 1/4 అడుగులు కొలతగల కొట్టు గదికి హద్దులు తూ|| సూరి దుర్గారావు డాబా ఇల్లు, ద|| బొడ్డేపల్లి బాలాజీ కొట్టుగది, ప|| R&B రోడ్డు, ఉ|| గోరు చంద్రమ్మ డాబాకొట్టు గది.

3వ ప్రతి: అమలు షెడ్యూలు దాఖలా జిరాయితీ మెట్టు, రాజాం గ్రామం, రాజాం నగరపంచాయతీ, రాజాం మండలం శ్రీకాకుళం జిల్లా ప్రస్తుతము విజయనగరం జిల్లా in Sy no 31-6 Part Degree College Area D.No.1-202 Plot No. 600 తూ|| ప|| 15 అడుగులు ఉ|| ద|| 60 అడుగులు in 100 చదరపు అడుగు మెట్టు ఖాళీ స్థలమునకు తూ|| Plot NO. 599 ఖాళీ స్థలం ద|| ఇతరుల మెట్టు భూమి, ప|| వారణాసి వాసుదేవరావు Plot No. 601 స్థలం ఉ|| 20 అడుగులు రోడ్డుపై హద్దుల మధ్యస్థమైన ఆస్తి.

	1వ ప్రతి	2వ ప్రతి	3వ ప్రతి
DHR విలువ:	5,00,000	2,20,000	6,50,000
Ami విలువ:	3,00,000	2,00,000	6,00,000
Sub Register విలువ:	24188	32724	6000

గెద్దపు కృష్ణప్రసాద్
DHR తరపు న్యాయవాది,
విశాఖ ఎ కోలనీ, శ్రీకాకుళం జిల్లా,
సెల్: 7893450188.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం మండల పరిధిలో దుప్పాడలో ఆర్‌ఎస్‌కె క్లస్టర్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఎంసి చైర్మన్ కర్రోతు నర్సింగరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలినాయుడు తదితరలుఉ శనివారం ప్రారంభించారు. విజయనగరం మండల పరిధిలో వరి సాధారణ విస్తీర్ణం 1569 హెక్టార్లు కాగా, ఈసారి వరి సాగుకు అనుకూల పరిస్థితులు ఉండడంతో మండల వ్యాప్తంగా 1740 హెక్టార్లు సాగైందని తెలిపారు. కోరుకొండ, రాకోడు, ద్వారపూడి, జొన్నవలస, చెల్లూరు, కొండకరకాం రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరిస్తారని, రైతులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా మండల వ్యవసాయ అభివద్ధి అధికారి అడ్డూరి శ్రీనివాస్ తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు రైతు సొంత గోనె తరలిస్తే ఆ గోనె డబ్బులను రైతు ఖాతాలో జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ బి. చంద్రు నాయుడు, జొన్నవలస రాకోడు ఎంపీటీసీలు రాజేష్‌బాబు, శ్రీనివాసరావు, సివిల్ సప్లై డిప్యూటీ తాహశీల్దార్ రామారావు, వెలుగు ఎపిఒ పి.అప్పలస్వామి, సిసి ఎస్. అప్పలనాయుడు, విఎఒ ఆర్. సందీప్, దుప్పాడ టిడిపి నాయకులు రాంబాబు, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-వేపాడ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ సూచించారు. శనివారం మండలంలో బొద్దాం, పాటూరు గ్రామ సచివాలయాలను సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను, మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సకాలంలో సర్వేలు పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచీ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సోంపురం గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

గురుకుల సందర్శన

బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని ఎంపిడిఒ సూర్యనారాయణ ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. గురుకుల ఆవరణమంతా శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ నారాయణరావు

మత్తును చిత్తు చేద్దాం

ప్రజాశక్తి-రామభద్రపురం

మత్తును చిత్తు చేసేందుకు యువత ముందుకు రావాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు కోరారు. పోలీసు శాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర రామభద్రపురం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సదస్సులో టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు గ్రామాల్లో కూడా ఏర్పాటు చేయడం ద్వారా గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువతను దూరం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ అజురఫీజాన్, ఎంపిడిఒ రత్నం, ఎంఇఒ ఎ.తిరుమలప్రసాద్, హెచ్‌ఎం వంగపండు గోపాలనాయుడు, రామభద్రపురం, బాడంగి ఎస్‌ఐలు ప్రసాదరావు, తారకేశ్వరరావు, ఎఎస్ఐ అప్పారావు, ఈగల్ టీం లీడర్ మనోజ్, రామభద్రపురం ఇఒ సూరిబాబు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నీలయ్యవలస గ్రామానికి చెందిన సిహెచ్ విజయమ్మ (60) గడ్డిమందు తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ కలహాలే దీనికి కారణమని స్థానికులు చెబుతున్నారు. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది అక్కడికి చేరుకుని, ఆమెను రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాఠశాలకు సౌండ్‌బాక్స్ వితరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సర్పంచ్ మురిపిండి గంగరాజు కుమారుడు గోవింద కుమార్, సత్యనారాయణ రూ.20 వేలు విలువైన సౌండ్‌బాక్స్‌ను శనివారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.